నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 07, 2024 | www.navatelangana.com

నేడు జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన

నవతెలంగాణ-కామారెడ్డి/మద్నూర్/తాడ్వాయి

పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి, ఉమ్మడిజిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు మద్నూర్ మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కౌలాస్ పూర్ కోటను సందర్శిస్తారు. మధ్యాహ్నం నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం లింగంపేటలో నాగన్న బావిని సందర్శిస్తారు. మధ్యాహ్నం 3. 20 గంటలకు నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామంలో త్రిలింగ రామేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4 గంటలకు పోచారం ప్రాజెక్ట్ ను సందర్శిస్తారని తెలిపారు. కాగా మంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు చేపట్టామని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు.

నిబంధనలు పాటిస్తేనే.. లే అవుట్‌లకు అనుమతులు

- అధికారులతో పరిశీలించిన ఎమ్మెల్యే కేవీఆర్

నవతెలంగాణ-కామారెడ్డి



నూతనంగా ఏర్పాటు చేసే లే అవుట్ యజమానులు ఇష్టా రాజ్యంగా ఏర్పాటు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లే అవుట్ లలో ఉన్న సౌకర్యాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను పట్టణ టీ పి ఒ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. బృందావనం గార్డెన్స్ నుండి లింగాపూర్ దేవునిపల్లి వరకు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనక నుండి కామారెడ్డి సబ్ స్టేషన్ వరకు ఉన్న అన్ని లే అవుట్‌లను పరిశీలించారు. దేవునిపల్లి పరిధిలో హై టెన్షన్ వైర్ల కింద 83 ఫిట్ల రోడ్డు తప్పని సరిగా ఉండాలనీ హై టెన్షన్ వైర్ల కింద రెండు వైపులా 33 ఫిట్ల రోడ్డు తప్పని సరి అని అన్నారు.

ప్రజా పాలనకు ఏడాది

- సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు
- ఫ్రీ బస్సుతో మహిళలకు లబ్ది
- గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంట్‌తో కొంత ఊరట
- పథకాల అమలుపై ప్రజల్లో అసంతృప్తి
- రుణమాఫీ, రైతు భరోసా జాప్యంపై రైతుల్లో వ్యతిరేకత

నవతెలంగాణ-నిజామాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి నేటితో ఏడాది పూర్తి కానుంది. పదేండ్ల బీఆర్ఎస్ పాలన తరువాత రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మిన ప్రజలు ఆ పార్టీని అధికారం తీసుకొచ్చారు. ప్రజల అభీష్టం మేరకు ప్రజలు ప్రజా పాలనను అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని భరోసానిచ్చింది. అయితే ఈ మొదటి ఏడాదిలో కాంగ్రెస్ పాలన 'కొంచెం ఇష్టం-కొంచెం కష్టం' అన్న చందంగా కొనసాగుతోంది. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు కాగా.. ఇంకా అమలు కావాల్సినవి చాలానే ఉన్నాయి. కొన్ని ప్రారంభించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదనే అభిప్రాయం ఉంది. ముఖ్యంగా రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. రాబోయే నాలుగేండ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై కథనం.





గత ఏడాది డిసెంబర్ 7వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేర ఈ ఏడాది పాలన కొనసాగింది. అయితే పూర్తి స్థాయిలో మాత్రం జరగలేదు అన్నది వాస్తవం.

సంక్షేమం.. అభివృద్ధి..

రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన వారంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసింది. దీంతో మహిళలకు ఉచితంగా రాష్ట్రం మొత్తం ప్రయాణించే అవకాశం లభించినట్టయింది. అయితే ఈ పథకం అమలు తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి కనపడుతున్నాయి. ఈ నేపథ్యంలో పథకం అమలు చేసినా.. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచలేదని ఆరోపణలు వ్యక్తమయ్యాయి.

ఆ తరువాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, తదితర పథకాలు అమలు చేసింది. అయితే ఉచిత బస్సు అందరికీ అమలు అవుతున్నప్పటికీ గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. వీటితోపాటు మహిళలకు ఇస్తామన్న రూ.2,500 అమలు కావడం లేదు. ఆసరా పింఛన్ల పెంపు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వంటివి అమలు కాకపోవడంతో ప్రజలు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డులను త్వరలో ఇస్తామని చెప్పడం విస్మరించడం పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగాల భర్తీలో మెరుగు

అయితే నిరుద్యోగుల గోసతో ఏర్పడిన ఈ ప్రభుత్వం ఈ ఏడాది కొంత మేరకు ఉద్యోగాలు భర్తీ చేయడం సానుకూలంశం. టీచర్ పోస్టులతో పాటు గ్రూప్ 4 ఉద్యోగాలు భర్తీ చేయడంతో రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉన్నట్టు నిరుద్యోగులు భావిస్తున్నారు.

రైతుల్లో కొంత వ్యతిరేకత

రాష్ట్ర ప్రభుత్వంపై ముఖ్యంగా రైతుల్లో కొంత వ్యతిరేకత ఉన్నట్టు క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. దీనికి కారణం లేకపోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా దశల వారీగా రుణమాఫీ చేసింది. అయితే బ్యాంకర్‌ల తప్పిదాలు, రైతుల చిన్నచిన్న తప్పిదాలతో ఎక్కువ సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమైయ్యారు. సరిచేసి మరోసారి రుణమాఫీ చేసినా.. దాంట్లోనూ మొండిచేయి ఎదురవడంతో తీవ్ర నిరాశకు గురైయ్యారు. ఈ క్రమంలో కనీసం రైతుభరోసా వచ్చిన ఉపయోగపడేవనే అభిప్రాయం వ్యక్తమైంది. రైతుభరోసా వేయకపోవడంతో కూడా ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత రావడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుబంధు ఏడాదిలో రెండు సీజన్‌లకు వేసింది. కాంగ్రెస్ రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.7,500 ఇస్తామని చెప్పింది. కానీ ఇది అమలు కాకపోగా.. వానాకాలం సంబంధించిన డబ్బులు నేటికీ పడలేదు. అయితే ఈ పథకానికి సీలింగ్ పెడుతామని గతంలో చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం రాలేదు. రైతుభరోసా డబ్బులు సంక్రాంతికి ఇస్తామని ఇటీవల సీఎం ప్రకటించడం కొసమెరుపు. ఇదిలా ఉంటే కౌలు రైతులు, రైతు కూలీలకు అందాల్సిన చేయూత ప్రభుత్వం నుంచి ఇప్పటికీ అందలేదు. ఏదిఏమైనా కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజల్లో మంచి-చేడు సమానంగా ఉన్నాయనే చెప్పవచ్చు. అయితే ఏడాదిలోనే అన్నీ చేయలేరన్నది ఓ అభిప్రాయం. భవిష్యత్ నాలుగేండ్ల కాంగ్రెస్ పాలనపై మాత్రం ప్రజలు గంపెడు ఆశలతో ఉన్నరన్నది వాస్తవం.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

సమానత్వం, సామాజిక న్యాయం సాధించటమే
అంబేద్కర్‌కు నిజమైన నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు
- పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమానత్వం సామాజిక న్యాయం సాధించటమే అంబేద్కర్ కు నిజమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పులాంగ్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యంగా కుల నిర్మూలన, అసమానతలు లేని భారతదేశ నిర్మాణం కోసం దేశంలోని భూమి జాతీయ కరణ జరగాలని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కూడా యాజమాన్య వాటా ఉండాలని, స్త్రీ పురుష సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టినట్టు గుర్తుచేశారు. ఈ సందర్భంలో ప్రభుత్వాలు అంగీకరించకపోతే కేంద్ర క్యాబినెట్ నుండే ఆయన రాజీనామా చేసి బయటకు వచ్చినట్టు తెలిపారు. కానీ నేటి పాలకులు మనువాద సిద్ధాంతాన్ని ఆచరిస్తూ, కులాల్లో వ్యత్యాసాలను, అంటరానితనాన్ని, స్త్రీలు వంటింటికే పరిమితం కావాలని మనుధర్మ శాస్త్రాన్ని పాటిస్తున్నారని నేడు సమానత్వం కొరవడి, సామాజిక న్యాయం లభించక ప్రజల మధ్య తారతమ్యాలు పెరిగి మతవైశ్యమ్యాలకు దారితీస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. వీటికి వ్యతిరేకంగా ప్రజలందరూ సమానత్వం ,సామాజిక న్యాయం, కొరకు కలిసి పోరాటాల్లోకి రావాలని ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు జరపాలని అన్ని వర్గాల పేదలు పోరాటం చేసినప్పుడే అంబేద్కర్ కలలుగన్న సమానత్వం సామాజిక న్యాయం సాధించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, నగర నాయకులు కటారి రాములు, నరసయ్య, కృష్ణ, దినేష్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌కు నవోదయ విద్యాలయం

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

నిజామాబాద్ జిల్లాకు నవోదయ విద్యాలయాన్ని కేంద్రం మంజూరు చేసింది. ఢిల్లీలో కేంద్ర క్యాబినేట్ సమావేశం నిర్వహించగా రాష్ట్రానికి 7 నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. కాగా అందులో నిజామాబాద్ జిల్లాలో సైతం నవోదయ విద్యాలయం ఏర్పాటు కానుంది.

తప్పులు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి


ఓటరు లిస్టు పరిశీలించి మాట్లాడుతున్న అధికారి

ఎలాంటి తప్పులు లేకుండా ఫైనల్ ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ లో కలెక్టర్ తో కలిసి ఈఆర్ఒ లు, ఏఈఆర్ఒ లు, సూపర్వైజర్ లు, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను పరిశుభ్రంగా తయారుచేయడానికి ఇది ఒక సువర్ణావకాశం అని తెలిపారు. ఇంటింటి వెరిఫికేషన్ ద్వారా జాబితాను సవరించవచ్చని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి పరిశీలన చేయాలని, ఆ పరిశీలనలో ఓటరు స్థానికంగా ఉన్నారా, మరణించారా, శాశ్వతంగా వెళ్ళిపోయారా, తాత్కాలికంగా వెళ్ళారా, ఫోటో లో మార్పులు చేయాలా అనేవి పరిశీలన చేయాలని అన్నారు. ఎం.ఎల్.సి. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఓటరు జాబితాలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరి పేరు నమోదు చేయాలని తెలిపారు. ప్రైవేటు కళాశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, సూచనలు పాటించుటకు చర్యలు తీసుకొంటామని, తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేస్తామని తెలిపారు. పాల్వంచ మండలం వాడీ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ 46 బూత్ స్థాయి అధికారిని నిమ్మల లీల సేవలు సంతృప్తిగా ఉన్నందున భారత ఎన్నికల కమీషన్ అభినందించి బి.ఎల్. ఒ. ఈ - పత్రికలో ప్రచురించినందుకు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ లు రంగనాథ్ రావు, మన్నె ప్రభాకర్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాటలతో కాదు చేతల్లో అభివృద్ధి చూపిస్తా

- కామారెడ్డి అభివృద్ధికి రూ.27 కోట్లు మంజూరైనట్టు చేయించినట్టు షబ్బీర్‌అలీ వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

తాను మాటలతో అభివృద్ధి చేయనని, చేతలతో అభివృద్ధి చేసి చూపిస్తా అనిఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ వర్గాల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బిజెపి నాయకులు మాటలు చెబుతారు గాని అభివృద్ధి చేయరన్నారు. కామారెడ్డి అభివృద్ధికి 27 కోట్ల రూపాయల నిధులను ముఖ్యమంత్రి తో ప్రత్యేకంగా మాట్లాడి మంజూరు చేయించినట్టు వెల్లడించారు. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియం ఆధునీకరణ కోసం 8 కోట్ల రూపాయలు, పట్టణ అభివృద్ధి కోసం టి యు ఎఫ్ ఐ డి సి నిధులు 12 కోట్లు, ప్రత్యేకంగా టి యు ఎఫ్ ఐ డి సి 3.5. కోట్లు రూపాయలు. గ్రామీణ అభివృద్ధి కొరకు 4.50 కోట్లు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు సీసీ రోడ్ల కోసం మంజూరు చేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపర్యటనతో
మరమ్మతులకు మోక్షం

- రోడ్ల గుంతలను పూడ్చివేయించిన అధికారులు
- మంత్రి నిరంతరం పర్యటించాలని కోరుతున్న ప్రజలు

నవతెలంగాణ-నిజాంసాగర్


నిజాంసాగర్-ఎల్లారెడ్డి రోడ్డుపై గుంతలు పూడ్చివేస్తున్న కార్మికులు

రోడ్లమీద గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు, గ్రామస్తులు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదని, మంత్రి జూపల్లి పర్యటన నేపథ్యంలో ఆగమేఘాల మీద మరమ్మతు పనులు చేయిస్తున్నారని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు, సీఎం ఇతరులు వస్తేనే రోడ్లను బాగు చేస్తారా..? సామాన్య ప్రజల ఇక్కట్లను పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు.

నిజాంసాగర్ మండల కేంద్రం నుండి ఎల్లారెడ్డి వైపు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్ గుంతలమయంగా మారి ప్రయాణికులకు, వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కునేవారు. అయితే నేడు(శనివారం) మంత్రి జూపల్లి కృష్ణారావు ఇదే రోడ్డు మార్గాన మండల కేంద్రానికి చేరుకొని ఇక్కడి నుండి లింగంపేట్ నాగన్న బావికి సందర్శనకు వెళ్లనుండటంతో గుంతలమయంగా మారిన రోడ్డును శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. మంత్రులు వస్తేనే గ్రామాలను పరిశుభ్రం చేస్తున్నారని, రోడ్ల మరమ్మతులు చేస్తున్నారని.. అన్ని మండలాల్లోని గ్రామాల్లో సైతం మంత్రి పర్యటనలు ఉంటే అభివృద్ధి పనులు జోరుగా సాగే అవకాశం ఉంటుందని స్థానికులు చర్చించుకుండటం గమనార్హం.

భోజనం బాగుంటుందా?

- కస్తూర్బా గాంధీని సందర్శించిన విద్యా కమిషన్ సభ్యురాలు

నవతెలంగాణ-నిజాంసాగర్



మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను శుక్రవారం సాయంత్రం విద్యా కమిషన్ సభ్యురాలు జోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. పాఠశాలలో అందిస్తున్న భోజనం బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. భోజనం వండేందుకు సంబంధించిన సామగ్రిని ఆమె పరిశీలించారు. స్టాక్ రూమ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఆమె వెంట డీఈఓ రాజు, జీడిఓఓ సుకన్య, ఎంఈఓ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

- రిటైల్‌లో ఒక్క గుడ్డు రూ.8..
- హోల్‌సేల్‌లో కిస్తీ రూ.210



నవతెలంగాణ-గాంధారి

కోడిగుడ్డు ధర కొండెక్కింది. మొన్నటి వరకు ఐదు, ఆరు పలికిన రిటైల్ ధర.. ఒక్కసారిగా రూ.8కి చేరింది. హోల్‌సేల్‌లో ఒక కిస్తీ ధర రూ.210 పలుకుతుంది. డిమాండ్ తగ్గట్టు సరఫరా లేకపోవడంతో ధరలు అమాంతంగా పెరిగినట్టు వ్యాపారులు పేర్కొంటున్నారు. చలికాలంలో కోడిగుడ్ల సరఫరా తగ్గుతుంది. అయితే వినియోగం పెరుగుతుంది. దీంతో డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడంతో ధరలు అమాంతంగా పెరిగిన సామాన్యుడికి అందుబాటులో ఉండకుండా పోతోంది.

సామాన్య ప్రజానీకం నిత్యం వాడుకలో ఆహారం కోసం వాడుకునే కోడిగుడ్డు ధరలు అమాంతం పెరగడంతో పేద సామాన్య వర్గాలు అమ్మో కోడిగుడ్డు ధర ఇంతనా అని నోరెళ్లబెడుతున్నారు. ఒక్కో కోడిగుడ్డు ధర ఎనిమిది నుంచి తొమ్మిది రూపాయలకు అమ్ముతున్నారు. ఒక వైపు నూనె, పప్పుల ధరలు, నిత్యావసరాల ధరలు పెరిగి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతున్న నేపథ్యంలో తాజాగా కోడిగుడ్డు రేట్ సైతం పెరగడంతో పోషకాలకు దూరమవుతున్నారు.

కోడిగుడ్డును ప్రజలు విరివిగా ఉపయోగిస్తుంటారు. పిల్లలకు పోషకాల కోసం ఉడకబెట్టి ఇస్తుంటారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో హాస్టల్లో వారానికి మూడుసార్లు కోడిగుడ్డును విద్యార్థులకు అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజనం వాళ్ళు హాస్టల్లో ధరలు పెరగడంతో లబో దిబో అంటున్నారు. దాదాపు నాలుగేండ్ల తర్వాత గరిష్టస్థాయిలో ధరలు పెరిగినట్టు వ్యాపారులు పేర్కొంటున్నారు.

మమ్మల్ని క్రమబద్ధీకరించండి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరసన దీక్ష



నిరసన రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని సమగ్ర శిక్షలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో రిలే నిరసన దీక్ష శుక్రవారం చేపట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కే.రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి, మరణించిన ఉద్యోగ కుటుంబాల కు 20 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలి, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ లకు 12 నెలల వేతనం ఇవ్వాలి, 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షలు రిటైర్మెంట్ బెన్‌ఫిట్‌గా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూపెందర్, కోశాధికారి ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గౌరవాధ్యక్షులు అశ్రఫ్ అలీ అంజయ్య, అంబదాస్ రావు, గంగమని, యూసుఫ్ అలీ, గిరీష్ నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం కోసం
స్థల పరిశీలన ప్రతిపాదనలు అందలేవ్

- ఎంపీ ప్రశ్నకు మంత్రి సమాధానం


కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జక్రాన్‌పల్లి వద్ద నిర్మించాలన్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి స్థల అనుమతి కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపానదుల రాలేదని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహెూల్ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా విమానాశ్రయాల నిర్మాణానికి ఆరు చోట్ల ప్రీ ఎలిజిబిలిటీ అధ్యయనం నిర్వహించిందని, అందులో భాగంగా వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బ్రౌన్ ఫీల్డ్ , నిజామాబాద్ జిల్లాలోని జక్రాన్ పల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి సాంకేతికంగా వీలున్నట్టు గుర్తించిందని తెలిపారు. ఈ మూడు చోట్ల ఏర్పాట్లు నిర్మించాలంటే అబ్జకిల్ లిమిటేషన్ సర్వీసెస్ సర్వే నిర్వహించి, కేంద్ర పౌర విమానయాన శాఖ , ఇతర రెగ్యులేటరీ, చట్టబద్ధ సంస్థల నుంచి అనుమతులు తీసుకోమని తెలంగాణ ప్రభుత్వానికి ఏఏఐ సూచించిందని మంత్రి పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ యువజన నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి



బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ యువజన మండల నాయకులు, మంగళ్ పహాడ్ యువజన నాయకులు ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతనం చేస్తూ, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని యువతను ఆకాంక్షించారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ హామీల పథకాలపై ప్రజలకు అవగాహన చేయాలని యువకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువకులను అభినందించారు.

ఉత్తమ నాట్య ప్రదర్శనకు జ్ఞాపికలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తావద్దగల నటరాజ నత్యానికేతన్ చిన్నారులు ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అద్భుత ప్రదర్శన చేసినట్టు నాట్య గురువు డాక్టర్ బాశెట్టి మణాళిని శుక్రవారం తెలిపారు. స్వాతి ఆర్ట్స్ క్రియేషన్ 29వ గోల్డెన్ స్క్రీన్ కార్యక్రమంలో భాగంగా పేరిణి నత్యం, స్వాగతం, నవదుర్గం అనే నత్యాలను ప్రదర్శించినట్టు, ఈ సందర్భంగా తెలంగాణ కల్చరల్ డైరెక్టర్ మామిడి హరికష్ణ చేతుల మీదుగా జ్ఞాపికలు అందించి అభినందనలు తెలిపినట్టు నాట్య గురువు తెలిపారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించాలి

- స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధర్మేందర్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎస్ఎస్ఏలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలిపారు. వారికి హెల్త్‌కార్డ్స్ ఇవ్వాలని ప్రభుత్వంను కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే అన్నిరకాల ప్రయోజనాల్ని వారికి వర్తింపచేసి, ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలను అమలుచేసి చిత్త శుద్ధి చాటుకోవాలని కోరారు.

రైజింగ్ డే సందర్భంగా ప్రశంసా పత్రాలు



హోంగార్డుకు ప్రశంసా పత్రాలను అందజేసిన అదనపు పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా పోలీస్ కార్యాలయంలో హెూమ్ గార్డ్స్ సంస్థ 75వ రైజింగ్ డే కార్యక్రమం అదనపు పోలీస్ కమీషనర్ (అడ్మిన్) కోటేశ్వర రావు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెూమ్ గార్డు సంస్థ యందు జిల్లా వ్యాప్తంగా అత్యుత్తమ సేవలు చేసినందులకు గాను ప్రశంసా పత్రములు ఇచ్చి ప్రశంసించారు. హోమ్ గార్డ్స్ ఎమ్.స్వామీ, నెంబర్ 633, ఆర్మూర్ పి.యస్, పి.పోతన్న, నెంబర్ 135, బోధన్ రూరల్ పి.యస్, బి.జీవన్ సింగ్, నెంబర్ 533, ట్రాఫిక్ పి.యస్, ఎస్.రఘు వీర్, నెంబర్ 210, టౌన్ 3 పి.యస్,షేక్ ఖాజా, నెంబర్ 679, నిజామాబాద్ ఎ.సి.పి ప్రశంసించారు. ఈ సందర్భంగా అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) శంకర్ నాయక్, ఆర్మ్డ్ రిజర్వు (అడ్మిన్) సతీష్, (ఎమ్.టి.ఓ) తిరుపతి, సిసిఆర్‌బి, సిఐ వీరయ్య, హెూమ్ గార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో న్యూసెన్స్ చేయగా రెండు రోజుల జైలు శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ రఘుపతి శుక్రవారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 5న నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూసెన్స్ చేసిన వర్ని ఎక్స్‌రోడ్‌కు చెందిన అంతగిరి అఖిలేష్‌పై ఒకటవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సూచించారు. శుక్రవారం కోర్టులో హాజరు పరచగా రెండవ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజులపాటు జైలు శిక్ష విధించినట్టు తెలిపారు. నిందితుడిని జైలుకు తరలించినట్టు పేర్కొన్నారు.

బోర్ వెల్ బండి సీజ్

నవతెలంగాణ-మోపాల్

ముదక్‌పల్లి బీట్ పరిధిలోగల ధర్మారం అటవీ ప్రాంతంలో అటవీ భూములలో అక్రమంగా బోర్ వేస్తున్న సమయంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి రాధిక, బీట్ ఆఫీసర్ సంయుక్త, మిగతా అటవీశాఖ సిబ్బందితో కలిసి బోర్ వెల్స్ బండిని శుక్రవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లు కోసిన, భూములను చదును చేసినా కూడా చట్టరీత్యా నేరమని కచ్చితంగా వారిపైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాముల బస్తిలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని, నిజామాబాద్ జిల్లా భీమ్ ఆర్మీ, సన్ రైస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 43వ డివిజన్ స్థానిక పాముల బస్తిలో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌లో స్థానిక ప్రజలకు బిపి, షుగర్, థైరాయిడ్ ఈసీజీ మొదలగు టెస్టులు చేసి వారికి మందులు అందించారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లా తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు అలుక కిషన్ ప్రారంభించారు అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ మైనార్టీ బడుగు బలహీన వర్గాల ఆరోగ్యం, సంక్షేమం కోసం భీమ్ ఆర్మీ కృషి చేస్తుందని వారికి ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. అంబేద్కర్ అందించిన స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాదాలే అజయ్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిహెచ్ వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు విజయ్ సాలుంకే, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్ గైక్వాడ్, బిలేందర్ సింగ్, వికాస్, అనిల్, సోన్, క్రామే రాజు, యాదగిరి, లింగయ్య, దేవయ్య, భిక్షపతి, భూలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామానికి చెందిన 15మంది లబ్ధిదారులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కృషితో మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. 15 మంది లబ్ధిదారులకు సుమారు 3 లక్షల రూపాయల చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్ గౌడ్, మాజీ సర్పంచ్ మారు శంకర్, రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు శాంభవి హై స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-బాల్కొండ



జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో శాంభవి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల చైర్మన్ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. జిల్లా నుంచి ఇప్పటివరకు 126 ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్స్ ఎంపిక చేసిన కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రాజెక్టు నిర్వాహణకు విద్యార్థుల ఖాతాలో పదివేల రూపాయల చొప్పున జమ చేశారని తెలిపారు. ఇందులో భాగంగా శాంభవి హైస్కూల్ నుంచి 2023-24 సంవత్సరానికి మూడు ప్రాజెక్టులు ఎంపిక చేశారని అన్నారు. శాంభవి విద్యార్థులైన జెట్టి అభిజ్ఞ, పడకంటి సంయుక్త, రుపిత చేసిన ప్రాజెక్టులను శుక్రవారం ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ నిజామాబాద్‌లో జరుగుతున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ 2024 ప్రదర్శనలో ప్రదర్శించారని చైర్మన్ మధుసూదన్ తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రాజెక్ట్ గైడ్ టీచర్ మనోజ్ఞ, కృష్ణదాస్ పాల్గొన్నారు.



ఆస్పత్రి నుంచి పిల్లలను ఎత్తుకెళ్లకుండా సెన్సార్‌తో కట్టడి చేయడంపై ఘన్‌పూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఆవిష్కరణ



విండో మైక్రో ఫార్మింగ్ నిర్వహిస్తున్న కసాబ్‌గల్లి గర్ల్స్ స్కూల్ విద్యార్థులు



దొంగ ఓటు వినియోగించుకోకుండా వేలిముద్ర సెన్సార్ తయారు చేసిన విద్యార్థులు

అట్టహాసంగా ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గాలితో విద్యుత్ ఉత్పత్తిపై వివరిస్తున్న విద్యార్థులు

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ప్రదర్శనలు నిజామాబాద్ నగరంలోని సుభాష్‌నగర్‌లోగల ఎస్ఎఫ్ఎస్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇన్‌స్పైర్ ప్రదర్శనలో 126 ఎగ్జిబిట్లతో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్‌గా పింటూ నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుంచి వచ్చి పరిశీలించారు. జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని కార్యక్రమానికి సంబంధించి 410 ఎగ్జిబిట్లతో వివిధ యాజమాన్యాల నుంచి విద్యార్థులు వారి గైడ్ టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపతి రెడ్డి రూరల్ ఎమ్మెల్యే విచ్చేశారు. అదే విధంగా కార్యక్రమానికి ధన్ పాల్ సూర్యనారాయణ అర్బన్ ఎమ్మెల్యే సభాధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా సైన్స్ అధికారి కే గంగా కిషన్, డైట్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, వాసుదేవరావు, సాయిరెడ్డి, కాంతారావు , సీతయ్య, సురేష్ హెడ్మాస్టర్, వివిధ సంఘ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన ప్రధాన అంశం సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అను ప్రధాన అంశంలో ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత, నేచురల్ ఫామింగ్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ డిజాస్టర్ మేనేజ్మెంట్ రిసోర్స్ మేనేజ్మెంట్ మ్యాథమెటికల్ మోడలింగ్, ఉప అంశాల్లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలతో పాల్గొన్నారు.



శరీరంలో ఉన్న అవయవాల పనితీరు అర్థమయ్యే విధంగా వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

ఆటోడ్రైవర్ల జీవనోపాధి అస్తవ్యస్తంగా మారింది

- టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ పిలుపు
- 7న ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల ఆటోడ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ ఆవేదన వ్యక్తం చేసారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న జరిగే రాష్ట్రవ్యాప్త ఆటో, మోటార్‌ల బంద్‌కు టియుసిఐ పిలుపు నిచ్చింది. శుక్రవారం ట్రేడ్ యూనియన్ సెంటర్ అఫ్ ఇండియా (టియుసిఐ) ఆధ్వర్యంలో బంద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్సు వల్ల ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాలని కోరారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలని డిమాండ్ చేసారు. ఆటో బంద్‌లో భాగంగా నెహ్రూ పార్క్ నుంచి ధర్నా చౌక్ వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ల నాయకులు, ఆటో కార్మికులు హైమద్, రమేష్, చిన్న బాబు, లక్ష్మణ్, నరేష్, జానీ, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవి ప్రకాష్

నవతెలంగాణ-మాక్లూర్

రాష్ట్ర మంత్రిపై ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి ఆర్మూర్ నుంచి ఓడిపోయిన మా ఎమ్మెల్యే అంటూ జిల్లా కలెక్టర్ కు పరిచయం చేశారని తెలిపారు. ప్రజా సమస్యలు, నియోజక వర్గ అభివద్ధి విషయంలో పోటీ పడాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి సూచించారు. ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ఆర్మూర్‌లో ఉంటూ ప్రజల సమస్యలను తీరుస్తున్నారని పేర్కొన్నారు. మంత్రులపై , ఆర్మూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డిపై విమర్శలు చేస్తే సహించేది లేదని, అడుగడుగున అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల ముందు తన స్వంత డబ్బులతో నియోజకవర్గంలో నిరుపేదలకు ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారని, దాన్ని నెల బెట్టుకోవాలని గుర్తు చేశారు. సంవత్సర కాలంలో ఏం అభివద్ధి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఇప్పటి వరకు ఎంత నిధులు తీసుక వచ్చారు, ఎంత అభివద్ధి చేశారో, కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జిగా వినయ్ రెడ్డి ఎన్ని నిధులు తెచ్చారో చర్చకు రావాలని ఎమ్మెల్యేపై సవాల్ విసిరారు. అనంతరం జిల్లా పంచాయతీ రాజ్ సంఘటన అధ్యక్షులు గంగాధర్ గౌడ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు గంగాధర్ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం చైర్మన్ బురోల్ల అశోక్, వైస్ చైర్మన్ శేఖర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం

- బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రేగుంట దేవేందర్
- బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ బాల్కొండ/ముప్కాల్/ఆర్మూర్



ముప్కాల్ : అరెస్టు అయిన నాయకులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకొని ప్రశ్నించే గొంతులను నొక్కాలనే ప్రయత్నం చేస్తుందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు.శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అరెస్టును ఖండిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు ఇచ్చిన ధర్నా పిలుపులో పాల్గొనకుండా మండలానికి చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, కమ్మర్‌పల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, మాజీ ఎంపిటిసి మైలారం సుధాకర్‌ను ముందస్తుగా అరెస్టు చేసి కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు దేవేందర్ విలేకరులతో మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నేతలపై రేవంత్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ పాలనను కేటీఆర్, హరీష్ రావు ఎండగడుతున్నారనే ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై నిర్బంధం కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వం పెట్టే కేసులకు భయపడమని, ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు.

బాల్కొండ : బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే హరీష్ రావు, కౌశిక్ రెడ్డిల అరెస్టుకి నిరసనగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించకుండా శుక్రవారం పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, కన్న పోశెట్టి, రామరాజు గౌడ్, గోవర్దన్ గౌడ్, ప్రసాద్ గౌడ్, ఫయాజ్ అలీ, రాజేష్, ఇఫ్తెఖరొద్దీన్ ఉన్నారు.

ముప్కాల్ : మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే హరీష్ రావ్, పాడి కౌశిక్ రెడ్డిల అరెస్ట్ కు నిరసనగా శుక్రవారం మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపడతారని ముందుగానే ముప్కాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వారి సొంత పూచీకత్తుపై విడుదల చేశామని ఎస్ఐ రజినీకాంత్ తెలిపారు. అరెస్టు అయి విడుదల అయిన వారిలో పార్టీ అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకటరెడ్డి, రెంజర్ల మాజీ సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, నాయకులు చిల్క రఘు, గంగాధర్, రఫీ, ముఖీద్ తదితర నాయకులు ఉన్నారు..

ఆర్మూర్ : అక్రమ అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చలో ట్యాంక్ బండ్ నిరసనకు పిలుపునిచ్చిన సందర్భంగా పార్టీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, మాజీ సర్వసమాజ అధ్యక్షులు రవి, మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి, జిల్లా యువజన నాయకులు మీరా శ్రవణ్, టీఆర్ఎస్‌వి నాయకులు మహమ్మద్ సైఫ్, రాజు చింటూ హరీష్ అరెస్టయ్యారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-భీంగల్ రూరల్



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తాహేర్ బీన్ హందాన్, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో శుక్రవారం భీంగల్ మండల కేంద్రంలో రైతు, మహిళా సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో సాధించిన విజయాల గురించి వారు మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో ముత్యాల సునీల్ కుమార్ ఓడిపోయినా ఎన్నికల సమయంలో చెప్పినట్టు నియోజకవర్గంలో గంజాయిని ఉక్కు పాదంతో అణిచివేస్తామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో 2 లక్షల లోపు రుణాలను మాఫీ చేశామని, మిగిలిన రుణాలను త్వరలోనే మాఫీ చేస్తుందని అన్నారు. ఈనెల 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసాపై చర్చించి సంక్రాంతి తర్వాత ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తామని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటికే మెజారిటీ రైతులకు రుణమాఫీ అయిందని మిగిలిన రైతులకు త్వరలోనే మాఫీ అవుతుందని అన్నారు. వరి పంటకు 500 రూపాయల బోనస్ ఇవ్వడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్ ద్వారా, 500లకు గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా మహిళలకు వేల కోట్ల రూపాయలు ఆదా అవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు ప్రజలకు అందుబాటులో ఉండడం వల్ల సమస్యలను పరిష్కరించే మార్గం సులువవుతుందని తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీని అభివద్ధి చెసె బాధ్యత తీసుకుంటానని ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్ర సాఫ్ట్ బాల్, బేస్ బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 7 నుండి 9 వరకు జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఆర్మూర్ క్రీడా మైదానంలో జరగనున్న 68వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్ 17 పోటీలకు జక్రాన్‌పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు బాలికల విభాగంలో సాంబార్ నిత్యశ్రీ, గేడం సరిత, బాలుర విభాగంలో జక్కం పవన్ ఎంపికయ్యారు. ఈనెల 7 నుండి 9 వరకు జగిత్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర మహిళల సీనియర్ బేస్ బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థిని గడ్డం సంధ్య జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్యంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పోటీలలో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న విద్యాశాఖాధికారి, పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

జిల్లా స్థాయిలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నిర్వహించిన వంటలపై పోటీలు నిర్వహించగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత తెలుగు మీడియం ఆంగ్ల మధ్యమ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తున్న దేరడి లక్ష్మికి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతిని అందుకున్నట్టు విద్యాశాఖ అధికారి, జడ్పిహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు శుక్రవారం తెలిపారు. వంట వండడం, రుచికర భోజనాలు ఎలా చేయాలనే అంశాలపై అవగాహన నిర్వహించి, అనంతరం వంట పోటీలను నిర్వహించారు. పోటీల్లో దేరాడి లక్ష్మికి ద్వితీయ బహుమతి రావడం పాఠశాలకే గర్వకారణమని, పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్నం భోజన ఏజెన్సీ హర్షం వ్యక్తం చేస్తూ లక్ష్మిని అభినందించారు.

రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

- విస్తరణ అధికారి వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రక్తహీనత రాకుండా అందరూ పూర్తిస్థాయిలో పౌష్టికాహారం తీసుకొని సరియైన మోతాదులో హిమోగ్లోబిన్ ఉండే విధంగా చూసుకోవాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని మండల విస్తరణ అధికారి వై శంకర్ పేర్కొన్నారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్‌వాయి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గన్నారం లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వై.శంకర్ మాట్లాడుతూ దోమలు పెరగకుండా నీటి నిల్వగల ప్రాంతాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి తెలియజేసి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పగటిపూట నిండుగా దుస్తులు ధరించాలని, పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. విటమిన్లు అధికంగా గల తాజా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు, పాలు, బెల్లం, పల్లి పట్టీలు, మునగకాయలు, మునగ ఆకు అధికంగా తీసుకోవాలని వివరించారు. మోతాదులో హిమోగ్లోబిన్ ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా ఫైలేరియా లాంటి వ్యాధులు కలగజేసే దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఆరోగ్య కార్యకర్త దేవి మేరీ, ఆనంద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

- పాల్గొననున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమం మండలకేంద్రంలో శనివారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ తెలిపారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ మండలకేంద్రంలోని గురడి కాపు పాత సంఘంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి పాల్గొననున్నారని, మండలంలోని నాయకులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, కార్యకర్తలు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు నిర్వహించే మహాపూజలో పాల్గొననున్నారని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
శనివారం | డిసెంబర్ 07, 2024 | www.navatelangana.com

మట్టి పరీక్షలతో భూసారాన్ని పెంచుకోవచ్చు

- మండల వ్యవసాయ అధికారిణి భాను శ్రీ



నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు తమ పంట పొలాల్లోని మట్టి పరీక్షలు చేయించుకొని భూసారం పెంచేకునేందుకు కృషి చేయవచ్చని మండల వ్యవసాయ అధికారిణి భాను శ్రీ రైతులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో మట్టి శాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... మట్టి పరీక్షతో భూసార లోపాన్ని గుర్తించి తగిన మోతాదులో ఎరువులను అందించి, భూసారాన్ని పెంచుకొని, రైతులు అధిక దిగుబడిని సాధించి లబ్ధి పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా మట్టి పరీక్షలు నిర్వహించనున్నందున రైతులు తమ పంట పొలాల్లోని మట్టి శాంపిళ్లను వ్యవసాయ అధికారులకు అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఏఈఓ రాకేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హైవే మంజూరులో ఎమ్మెల్యే తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సోషల్ మీడియా ద్వారా నేషనల్ హైవే 161 బిబి రోడ్డు నిర్మాణం విషయంలో తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బిజెపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు తెప్ప తుకారాం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2023లో మంజూరు చేసిన దానికి మా హాయంలో మంజూరైనట్టు సోషల్ మీడియా ద్వారా జుక్కల్ ఎమ్మెల్యే తప్పుడు ప్రచారం చేయడం సరైనది కాదని దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తెప్పవర్ తుకారాం, జిల్లా జనరల్ సెక్రెటరీ కృష్ణ పటేల్, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ తులావర్ సంతోష్, కిసాన్ మోర్చా మండల్ అధ్యక్షులు కంచిన్వార్ యాదవ్ రావ్, సింగిల్ విండో డైరెక్టర్ సక్కర్లావర్ బాలకిషన్, సుంకూరు అంజన్న, ఆకుల్వార్ అనిల్, బీజేపీ కార్యకర్తలు, పాల్గొన్నారు.



గాంధారి : అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు



తాడ్వాయిలో...



రామారెడ్డిలో...



మద్నూర్ : విద్యార్థులకు పుస్తకాలు అందజేత

హక్కులు, సమానత్వం.. అంబేద్కర్

- సామాజిక న్యాయం కోసం కృషి చేసిన వ్యక్తి
- అంబేద్కర్‌కు వర్ధంతి నివాళి అర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బడుగు బలహీన వర్గాల కోసం, మహిళా హక్కుల కోసం, సమానత్వం సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. అందరికీ సమాన విద్య అందడం కోసం పరితపించిన వ్యక్తి అని అన్నారు. అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పలువురు నివాళి అర్పించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..

కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కోతోల్ల గంగారాం ఆధ్వర్యంలో డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 68 వర్ధంతి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బి.వి.ఎమ్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విట్టల్,బి ఎమ్ ఎమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, మైనార్టీ నాయకులు అబ్దుల్ అజీజ్, సంగి మోహన్, సంగి ప్రవీణ్,రాజేష్,సత్యరాజ్, బిబిపేట్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో శుక్రవారం బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షులు ముదాం నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైని శివాజీ, గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, నాగభూషణం, సిద్ధిరాములు, మండల కాంగ్రెస్ నాయకులు రాజలింగం తదితరులు ఉన్నారు.

సదాశివానగర్ : అంబేద్కర్ 68 వ వర్ధంతి సందర్భంగా మండల కేద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో ని ప్రజాప్రాతినిధులు, అంబేద్కర్ సంఘము సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జుక్కల్ : మండలంలోని పెద్దఏడ్గి గ్రామంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న అంబేద్కర్ చిత్రపటానికి మాజీ సర్పంచ్ అస్పత్ వార్ వినోద్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "ఎంత ఎక్కవ కాలం బతికమాన్నది కాదు.. ఎంత గొప్పగా జీవించామన్నదే ముఖ్యం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఖండేరావ్ గ్రామ ప్రజలు నాగేష్ సాయిలు అశోక్ దత్తు నితిన్ మారుతీ విలాస్ తదితురులు పాల్గొన్నారు.

కామారెడ్డి : సామజిక సమరసతా వేదిక కామారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద గల మహనీయునికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు శుక్రవారం అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అమృత రాజేంద్ర మాట్లాడుతూ.. ఏటికి ఎదురీదేవారు కొద్దిమంది ఉండవచ్చు, ఏటి నీటిని ఎదురు తిప్పేవారు ఎందరుంటారు? డాక్టర్ అంబేద్కర్ అలాంటి వ్యక్తులు కొందరే ఉంటారన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న డా.బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అడుగుజాడల్లో మోది జి పాలన కొనసాగుతుందని, ఆయన కలల సాకారం కోసం బీజేపీ పాటు పడుతుందన్నారు. ఎన్నో అవమానాలు, మరెన్నో ఛీత్కారాలు ఎదుర్కొన్న ఆయనకు అవే జీవిత పాఠాలు, అవరోధాలనే అందలంగా మార్చుకున్న మహనీయుడు భారతరత్న డాక్టర్ బిఆర్ అంబెద్కర్‌ను కొనుయాడారు.

మద్నూర్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు, రాజనీతిజ్ఞుడు, భారత రాజ్యాంగ నిర్మాత, అంటరానితనం, వివక్షలపై పోరు చేసిన భారతరత్న డా.బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు తెలియజేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

మండలంలోని మేనూర్ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో విద్యార్థులకు మద్నూర్ మండల మాల సంఘం అధ్యక్షుడు ఆకాష్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, శంకర్, సందీప్, ప్రకాష్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు తూర్పు రాజులు, మాజీ ఎంపిటిసి బాల్ రాజ్, లైని రమేష్, ఏఎంసి డైరెక్టర్లు సంగని బాబా, బొమ్మని బాలయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

రామారెడ్డి : మండలంలోని అన్నారం, రెడ్డిపేట్, రామారెడ్డితో పాటు ఉప్పల్వాయిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ జయంతి వేడుకలను శుక్రవారం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీ రెడ్డి మహేందర్ రెడ్డి, మద్దికుంట దయానంద్, గడ్డం గంగారెడ్డి, బిజెపి నాయకులు భూమా గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొత్తోల యాదగిరి, ఆల రాములు, రగోతం రెడ్డి, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా లింగంపేట్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం రాజ్యాంగ నిర్మాత ఆయన చేసిన త్యాగాలను కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, అంబేద్కర్ సంఘం లింగంపేట్ ప్రధాన కార్యదర్శి వివేకానంద, సభ్యులు, ముదాం స్వామి, చెన్నం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ పిలుపు

నవతెలంగాణ-జుక్కల్

రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (శనివారం) ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సురేశ్‌గొండ పిలుపు నిచ్చారు. ఆటో డ్రైవర్స్ ట్రాన్స్ పోర్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. శుక్రవారం మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆటో క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకపోవడం వలన ఆటో క్యాబ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో క్యాబ్ డ్రైవర్లకు అధికారంలోకి రాగానే సంవత్సరానికి 12 వేలు ఇస్తామని ప్రకటించిందని, ఆటో, మోటారు రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పిందని కానీ ఇప్పటి వరకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని తెలిపారు. వాటి అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా నేడు ఒక్క రోజు ఆటోల బంద్‌కు పిలుపునిచ్చామని, నియోజకవర్గంలోని ఏడు మండలాల కార్మికులు బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సైబర్ నేరాలు, షీ టీంపై అవాహన

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని కే.టీ.యస్ పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో షీటీం, సైబర్ నేరాల గురించి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రభాకర్ మాట్లాడుతూ.. షీటీం నెం.8712686094, సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల టోల్ ఫ్రీ నెంబర్ 100, 108, 1930, 181 లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే ప్రతి మహిళ ఫోన్ నందు టి సేఫ్ యాప్ (6 -ఖుటవ ఖజూజూ) డౌన్లోడ్ చేసుకోవాలని, ఇది మహిళలకు చాలా అత్యవసరమైనదన్నారు. యువత మాదకద్రవ్యాల వినియోగాన్ని అందరూ దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు సాయిలు, శేశవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ పార్టీ లింగంపేట్ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండలం కేంద్రంలోని గల బానాపూర్ నల్లమడుగు ఒంటరిపల్లి కొయ్య గుండు తండాలో గల 23 మంది లబ్ధిదారులకు 23 లక్షల 02,668 రూపాయలు గల కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశానుసారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేసినట్టు తెలిపారు. పార్టీలకు అతీతంగా కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. సమన్వయ కమిటీ సభ్యులు వంజరి ఎల్లమయ్య, సాయికుమార్, అశోక్, కౌడ రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్, గోపాల్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్. మండల యూత్ అధ్యక్షులు రాజు, లింగంపేట్ టౌన్ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, లక్ష్మీనారాయణ, శివలాల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యా బృందం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ కబడ్డీ పోటీలలో నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మౌనిక (9వ తరగతి) విద్యార్థిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సబ్బాత్ కృష్ణ తెలిపారు. ఈనెల 8న గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

దివ్యాంగులకు ఆటలపోటీలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆటలపోటీలు నిర్వహించారు. దివ్యాంగులు అధైర్యానికి గురికాకుండా తమలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ఉన్నత శిఖరాలకు ఎలా చేరుకోవాలో వివిధ వీడియో క్లిప్పింగ్స్ ద్వారా పిల్లలకు, తల్లిదండ్రులకు తెలియజేశారు. అలాగే దివ్యాంగుల పట్ల ప్రేమ భావంతో మెదిలి వాళ్ళ ఉన్నతికి కృషి చేయాలని తల్లిదండ్రులను కోరారు. తల్లిదండ్రులు పిల్లల వైకల్యం పట్ల ఎలాంటి ఆందోళన గురికాకుండా వాళ్లకు మంచి విషయాలు తెలియజేసి పిల్లల్లో అధైర్యాన్ని పోగొట్టి ధైర్యంగా జీవితాన్ని కొనసాగించేలా ప్రోత్సహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సదాశివ్ నగర్ మండల విద్యాధికారి యోసెఫ్ పాల్గొని దివ్యాంగులందరికీ బహుమతుల పంపిణీ చేశారు. అలాగే ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్ కూడా చెల్లించారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలి

నిజాంసాగర్ : దివ్యాంగులు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రతి విషయాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు నడవాలని పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలమనే నమ్మకం ప్రతి దివ్యాంగుడికి ఉండాలని పలువురు సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి, ఫిజియోథెరపీ డాక్టర్ అరుణ్ కుమార్, ఐ ఈ ఆర్ పి సునీల్, సాయిలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు, వడ్డేపల్లి మాజీ సర్పంచ్ ప్రజాపండరి పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తూ వంట చేయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

పరిశుభ్రత పాటిస్తూ వంట చేయాలని జల జీవన ఎంపవర్మెంట్ సొసైటీ డైరెక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వంట ఏజెన్సీకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తూ వంట చేయాలని ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కొని మాస్కులు సైతం ధరించి తాజా కూరగాయలతో పుష్టికరమైన ఆహారం అందించాలని సూచించారు. గుడ్లు పూర్తిస్థాయిలో ఉడికించినవే అందించాలని సూచించారు.

అయ్యప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు రండి

- షబ్బీర్‌అలీకి ఆహ్వానపత్రిక అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్‌లో ఈ నెల 10,11,12 తేదీల్లో జరగనున్న శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా షబ్బీర్ అలీని అయ్యప్ప స్వాములు కోరారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో షబ్బీర్ అలీకి బిబిపేట అయ్యప్ప సేవా సంఘం సమితి సభ్యులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

గ్రూప్-4 ఉద్యోగం పొందిన వ్యక్తికి సన్మానం



వినయ్‌కుమార్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కుప్రియాల్ మాజీ ఉపసర్పంచ్ సాయ గౌడ్ అన్నారు. మండలంలోని కుప్రియాల్ గ్రామంలో గ్రూప్-4 ఉద్యోగం సాధించిన లింగంపల్లి వినయ్ కుమార్‌ను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మంచి లక్ష్యం ఎంచుకోవాలన్నారు. గ్రామానికి చెందిన విద్యార్థి వినయ్ కుమార్ మున్సిపల్ శాఖలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వినయ్‌ను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హనుమండ్ల రాజయ్య టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చాకలి లింగం, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్ గౌడ్, నాయకులు చాకలి సంగయ్య, గంగరాజు, లక్ష్మణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

7,8న గ్రామస్థాయి పోటీలు

నవతెలంగాణ-మద్నూర్

ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మద్నూర్ ఉమ్మడి మండలంలో 7, 8 తేదీలలో గ్రామస్థాయి క్రీడలు నిర్వహించనున్నట్టు మండల ప్రత్యేక అధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఈ నెల 10 నుంచి 12 వరకు క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో గెలిచిన క్రీడా జట్లకు జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందని సూచించారు. పాల్గొనదలచిన క్రీడాకారులు సీఎం కప్పు కోసం రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్వహించే క్రీడలు వాలీబాల్, ఫుట్బాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్, యోగ, క్రీడలు జరుగుతాయని తెలిపారు.

సదాశివనగర్ కళాశాల ఇన్‌చార్జిగా నారాయణ

నవతెలంగాణ-సదాశివనగర్

రామరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ పి.నారాయణ సదాశివనగర్ జూనియర్ కళాశాల ఎఫ్ఎసి ప్రిన్సిపల్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందానికి ఆఫీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు ఫలితాలను కూడా గతం కంటే మెరుగ్గా వచ్చే విధంగా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపల్ అజ్మల్ ఖాన్, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తా



నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండల కేంద్రం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే మదనమోహన్ రావు తెలిపారని తాడ్వాయి వీడీసీ అధ్యక్షులు మేకల రాజు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యేను ఆయన స్వగృ హంలో కలిసి విన్నవించినట్టు తెలిపారు. గ్రామ ఊర చెరువు స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారని కొత్త బస్టాండ్ నుండి మండల పరిషత్ కార్యాలయ వరకు ఫోర్ వే లైన్ తో పాటు సెంటర్ లైటింగ్ నిర్మాణం చేపట్టడానికి నిధులు కేటాయిస్తామన్నారని తెలిపారు. నీటి సౌకర్యం కోసం 9 బోరు బావులు వేయించారని 1.75 లక్షలతో చిట్యాల సబ్ స్టేషన్ కు కేటాయించాలని, రూ.3.75 లక్షలతో సోమవారం బసనపల్లి రోడ్డు 6.5 లక్షలతో సంతాయిపేట్ చిట్యాల చందాపూర్ ఎర్ర పాడు గ్రామాల్లో సిసి రోడ్లకు నిధులు కేటాయించారని తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, నాయకులు సుధాకర్ రావు జలంధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల హక్కులను కాలరాయొద్దు

- బీడీ కార్మికులకు తక్షణమే రూ.4016 భృతి అమలు చేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి



రాష్ట్రంలో పనిచేస్తున్న 10 లక్షల మంది బీడీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ విధానం ద్వారా కార్మికులకు ఉపాధి కరువైందని తెలంగాణ బీడీ కామ్ గార్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం రామారెడ్డి రోడ్డు నుంచి బీడీ కార్మికుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు కొనసాగిన ఈ ర్యాలీకి బీడీ కార్మికులు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి బీడీ కార్మికురాలికి నెలకు 26 రోజుల పని కల్పించాలన్నారు. బీడి కంపెనీల యజమాన్యులు నేలకు 8 రోజుల నుంచి 12 రోజులు మాత్రమే పని కల్పిస్తూ చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. కార్మికులకు పని కల్పించాలని 40 బీడీ సంఘాలు తెలంగాణ బీడీ కామ్ గార్ ఫెడరేషన్ ద్వారా బీడీ కంపెనీలపైన లేబర్ డిపార్ట్మెంట్లో కేసులు పెట్టడం జరిగిందన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు నెలకు రూ.4016 పెన్షన్లు తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు అనుముల గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శివంది సత్యం, ఐరేని రాజేందర్, పర్వవ, రాజమణి, రజినీకాంత్, నర్సింలు, లింగం, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశాలకు లోనుకాకూడదు

- భవిష్యత్తులో అనేక అవకాశాలు వస్తాయ్
- జిల్లా మానసిక వైద్యాధికారి రమణ

నవతెలంగాణ-పిట్లం

విద్యార్థులు క్షణికావేశాలకు లోను కాకూడదని జిల్లా మానసిక వైద్యాధికారి రమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ లకు బానిసలు కాకూడదని ఆయన సూచించారు. విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ అయ్యామని , తక్కువ మార్కులు వచ్చాయని , సమాజంలో అవహేళనకు గురయ్యామని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. భవిష్యత్తులో చాలా రకాల అవకాశాలుంటాయని అందుకు తగువిధంగా మానసిక పరిపక్వతతో తయారవ్వాలని సూచించారు. ఎవరైనా మానసిక ఆందోళనకు గురవుతున్నట్లయితే నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 1441 కి కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకుంటూ మానసిక ఆరోగ్యం పై దృఢత్వం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యులు రోహిత్ , సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్ , అధ్యాపకులు నరేష్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మానసిక వైద్యాధికారి రమణ

హోమ్ గార్డ్ రైసింగ్ డే వేడుకలు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా పోలీస్ కార్యాలయంలో హెూంగార్డ్ రైసింగ్ డే వేడుకల్లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎఆర్ డిఎస్పి యాకూబ్ రెడ్డి పాల్గొని హెూంగార్డులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హెూమ్ గార్డు సంస్థ యందు జిల్లా వ్యాప్తంగా అత్యుత్తమ సేవలు చేసినందులకు గాను ప్రశంసా పత్రాలు అందజేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా ఎఆర్ డిఎస్పీ మాట్లాడుతూ హెూంగార్డ్స్ పోలీస్ శాఖలో ఒక భాగమై, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ... హెూంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమని అన్నారు. శాంతిభద్రతలు, ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతయుతమైన సేవలు అందించడంతో పాటు తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ , చత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో ఎన్నికల బందోబస్తులో అప్పగించిన భాధ్యతలు నిబద్ధతతో నిర్వహించారని అన్నారు. నిత్యం క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసుల ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హెూంగార్డుల సంక్షేమానికి జిల్లా యస్ పి సూచనలు, సలహాల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు మహేష్ , చంద్రశేకర్, జిల్లాలోని వివిద పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిసున్న హెూమ్ గార్డ్ లు పాల్గొన్నారు.



హోం గార్డుకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న డిఎస్పి

అదుపుతప్పి చెరుకు లారీ బోల్తా



అదుపు తప్పి బోల్తా పడ్డా చెరుకు లారీ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా జాతీయ రహదారిపై చెరుకు లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకు లోడ్‌తో మాగి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ముందటి టైర్ భాగం విరిగిపోగ అదుపుతప్పి బోల్తా పడింది. హైవే అధికారులు ఘటన స్థలాన్ని చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కబడ్డీ శిక్షణ పొందుతున్న సమయంలో ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన హేమంత్ క్రీడాకారుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సందర్భంలో హేమంత్ వైద్య ఖర్చుల నిమిత్తం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి రూ.5వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, ఉషా క్రీడా జిల్లా అధ్యక్షులు ఏలేటి గంగారెడ్డి, నునుగొండ అంజయ్య, మోతె గంగారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, సంజీవ్ థామస్, గోపి రాము, గద్దల గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

కులసంఘాల భవన నిర్మాణాలకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామానికి స్పెషల్ డెవలప్ మెంట్ (ఎస్డీఎఫ్)నిధుల ద్వారా 8 లక్షల రూపాయల మంజూరైనట్లు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా మున్నూరు కాపు సంఘం అదనపు గది నిర్మాణానికి 4 లక్షలు, మసీదులో అదనపు గది నిర్మాణానికి 4 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. వీటి భవన నిర్మాణాలకు గురువారం భూమిపూజ చేశారు. అడగగానే నిధులు మంజూరు చేసిన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, ఆయా సంఘాలకు చెందిన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు.

ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో జిల్లా యంత్రాంగం పనితీరు భేష్

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి
- ఈ.ఆర్.ఓ కార్యాలయాలు, ఈవీఎం గోడౌన్‌ల సందర్శన
- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష


ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-బోధన్, నిజామాబాద్‌సిటీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాల అమలులో నిజామాబాద్ జిల్లా యంత్రాంగం పనితీరు భేషుగ్గా ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) సి.సుదర్శన్ రెడ్డి ప్రశంసించారు. ఇతర అన్ని జిల్లాలతో పోలిస్తే ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన, మార్పులు, చేర్పులకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంతృప్తి వెలిబుచ్చారు. జిల్లా పర్యటనకు హాజరైన సీఈఓ సుదర్శన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి నిజామాబాద్ నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో కొనసాగుతున్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ ఆఫీసును, బోధన్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గల బోధన్ నియోజకవర్గ ఈఆర్ఓ ఆఫీసులను సందర్శించారు. నోటీసు బోర్డులపై అతికించిన ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, పేర్ల తొలగింపు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో మార్గదర్శకాలు పాటించారా లేదా అని రికార్డులను పరిశీలించి నిర్ధారణ చేసుకున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఆన్లైన్, ఆఫ్ లైన్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఈ.ఆర్.ఓలకు కీలక సూచనలు చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుండి వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, బోధనేతర విధుల్లో కొనసాగే వారి పేర్లు ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితాలో ఉండకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు. ఓటరు జాబితా నుండి మృతి చెందిన వారి పేర్లు తొలగించే సందర్భంలో మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలని, కుటుంబ సభ్యుల నుండి నిరభ్యంతర పత్రం తీసుకోవాలని సూచించారు. జిల్లాకు ఆనుకుని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఉన్నందున, పొరుగు రాష్ట్రంలో ఓటు హక్కు కలిగి ఉన్న పలువురు స్థానికంగా కూడా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట అర్హులైన వారి దరఖాస్తులను మాత్రమే ఆమోదించాలని అన్నారు.

అనంతరం సీఈఓ వినాయకనగర్ లోని ఈవీఎం గోడౌన్ ను సందర్శించి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బీ.యూలు, సీ.యులు, వీవీ.ప్యాట్ ల భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. సీసీ కెమెరాలు సక్రమంగానే పని చేస్తున్నాయా లేదా అని గమనించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు కలిగి ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సీఈఓ సమీక్ష జరిపారు. ఎస్.ఎస్.ఆర్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీఈఓ కు వివరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయని, ఇకముందు కూడా ఇదే తరహా శ్రద్ధ చూపాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, శాసనసభ, పార్లమెంటు సాధారణ ఎన్నికలు ముగిసినందున ప్రస్తుతం లభించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా ఓటరు జాబితా రూపొందేలా కృషి చేయాలని హితవు పలికారు. ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూసుకోవాలని, చిరునామాలో తప్పులు, మార్పులు ఉంటే సరిచేసుకోవాలని, ఓటరు లిస్టులో ఫోటో స్పష్టంగా ఉండాలని అన్నారు. ఎస్ఎస్ఆర్ లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం తెలియజేయాలని, క్రమం తప్పకుండా వారితో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాల్సిందిగా గుర్తింపు పొందిన పార్టీలకు తెలియజేయాలని అన్నారు.

9 వరకు ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు అవకాశం : కలెక్టర్

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన అర్హత కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఈ నెల (డిసెంబర్) 9 వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈ సందర్భంగా సూచించారు. ఆన్లైన్‌లో లేదా ఏఈఆర్ఓ కార్యాలయాల్లో నేరుగా కూడా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు జాబితాలో పేర్ల నమోదు కోసం గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో షాదీ ముబారక్, కళ్యాణ చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుందని, ముఖ్యంగా లక్ష కోట్ల రుణాలు ఇచ్చి మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ముఖ్యమంత్రి నిన్ననే ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ని ప్రారంభించారని, రూ.5లక్షల ఇల్లు కట్టుకునేందుకు విడుదల వారీగా అలాగే ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. హౌసింగ్ యాప్ ద్వారా ఎటువంటి అవినీతి లేకుండా జిల్లా కలెక్టర్, ఎంపీడీవో ఆధ్వర్యంలో అలాగే ఇందిరమ్మ కమిటీలు వీరిని గుర్తిస్తారని కచ్చితంగా నిరుపేదలందరికీ అందే విధంగా విడుదల వారీగా చూస్తామన్నారు. మొదటి విడద మన నియోజకవర్గానికి 3500 ఇల్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇది రైతు ప్రభుత్వమని రైతులను కూడా రాజులు చేస్తామని గత పాలకుల లాగా దాచుకోవడం, దోచుకోవడం మన ప్రభుత్వానికి తెలియదన్నారు. కార్యక్రమంలో మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, యువ నాయకుడు ముప్ప సందీప్ రెడ్డి, ఆకాష్, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ లింగన్న, గంగా ప్రసాద్, సతీష్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ తిరుపతి, మోపాల్ మండల యూత్ అధ్యక్షుడు తూర్పు రాజేష్, నాయకులు, ప్రజలు, పాల్గొన్నారు.

అడుగు తీసి అడుగు వేస్తే అణిచివేత

- అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

అడుగుదీసి అడుగేస్తే అణచివేత అమలు చేస్తున్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలోనూ చిట్టినాయుడి పాలనలో జై తెలంగాణ అంటే అరెస్టులు చేసి జైళ్ళపాలు చేస్తున్నారని ఆయన శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు.'అంబేద్కర్ గారి వర్ధంతి జరుపుకోవడానికి కూడా ఇన్ని ఆంక్షలా ?. రాజ్యాంగ నిర్మాతకు నివాళుల ర్పించకుండా నిర్బంధించడాన్ని ప్రజాపాలన అంటారా?. ఇందిరమ్మ రాజ్యమంటే ఇంతగా ప్రజలను హిసించడమా? అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీ నోటి వెంట నీతులు, రేవంత్ రెడ్డి నోటివెంట బూతులు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు, శ్రేణులను అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లకుండా చేసిన కాంగ్రెస్ సర్కారు దాష్టికాలు, అక్రమ గృహ నిర్బంధాలు, తప్పుడు కేసు లు, చట్టవ్యతిరేకమైన అరెస్టులను చూసి తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అసహ్యించుకుంటున్నదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల హౌస్ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. పోలీసు పాల నతో బీఆర్ఎస్ ప్రజా ఉద్యమాన్ని అడ్డుకోలేరని ఆయన హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫాసిస్టు చర్యలను అడ్డుకుంటామని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

భీంగల్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా భూక్య సురేష్



నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భీంగల్ మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడుగా భీంగల్ మండలం సుదర్శన్ నగర్‌కు చెందిన భూక్యా సురేష్ నాయక్‌ను ఎన్నుకున్నట్టు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఈ అవకాశం కల్పించిన మండలానికి చెందిన ముత్యాల సునీల్ కుమార్, ఇరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డికి యువకులకు, యువ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన జిల్లా ఎస్టీ మోర్చా నాయకులు


కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా నాయకులు బాదావత్ కిసాన్ నాయక్, బాణావత్ రాయలు, బాణావత్ రామ్ సింగ్, భగవత్ రమేష్, బాదావత్ రాయల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ప్రెసిడెంట్ సాయిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కొల్లసాని శ్రీనివాస్, ప్రొఫెసర్ విద్యాసాగర్, పిఎసిఎస్ చైర్మన్ రామచందర్ గౌడ్, కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు నరేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ తిరుపతి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో వేడుకలు

నవతెలంగాణ-సదశివనర్

మండలంలోని మర్కల్ మల్లన్న గుట్ట వద్ద గల విరాట్ పోతులూరి వీర బ్రహ్మం గారి కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రహ్మనుల సంఘం ప్రతినిధులు వడ్ల మహేష్ చారి, ముత్యం రాజు చారి, విష్ణు మూర్తి చారి, సాయిప్రసాద్, నరహరి, చిన్న గంగయ్య, రాజు, నవీన్ చారి, పూజరులు హనుమండ్లు చారి, వేణు చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆపన్న హస్తం కాదు.. భస్మాసుర హస్తం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ ఆపన్న హస్తం కాదని భస్మాసుర హస్తం అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ ఆరు అబద్దాలు అరవై ఆరు మోసాలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆర్ఆర్ చౌరస్తా నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించగా ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

అనంతరం ఎన్టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భహిరంగ సభలో ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలు గోస పడి మార్పు కోసం అని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు నమ్మి ప్రజలు అధికారం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి రాగానే వంద రోజుల్లో అమలు చేస్తానన్న గ్యారంటీలు, హామీలు ఏడాది పాలన పూర్తి అవుతున్న ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేసిన పాపాన పోలేదన్నారు. కేసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి, నియంతలా వ్యవహరించి దశాబ్ది ఉత్సవాలు జరిపితేనే ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఫామ్ హౌస్‌కి పరిమితం చేశారని అన్నారు.

ఇప్పుడున్న ముఖ్యమంత్రి ఏడాదికే విజయోత్సవాలు అని ప్రజాధనం వధా చేయడం మొదలు పెట్టిండని తెలిపారు. ఈ విజయోత్సవాలకు మీద, రేవంత్‌ను హస్తం పార్టీని బొంద పెట్టడం ఖాయం అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఉన్న హిందూ దేవుళ్ళ పై ప్రమాణం చేసి ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలలో వంద రోజుల్లో అమలు చేస్తానన్నా గ్యారంటీలు, హామీలు ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. ఏడాది పాలనలో తెలంగాణ భవితవ్యం అంధకారంలో నెట్టబడిందని అన్నారు. విజయోత్సవాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నారో? ఏవర్గం ప్రజలు పాల్గొనాలో.. ప్రజా ధనాన్ని ఎందుకు వధా చేస్తున్నారో? కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఇవ్వనందుకా..? ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ కాలేదని రైతులు ఉత్సవాలు చేయాలా అని ప్రశ్నించారు, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్‌లో తులంబంగారం, చదువుకునే ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటి ఇవ్వలేదని ఉత్సవాలలో పాల్గొనలా.. అని ప్రశ్నించారు వృద్ధులకు, నిరుద్యోగులకు జీవన భృతి, ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని యువత ఉత్సవాలు చేయాలా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ వస్తారో.. ఇంచార్జ్ మంత్రి వస్తారో చర్చకు రమ్మని ఎమ్మెల్యేగా తను కాంగ్రెస్ ఏడాది పాలన ఆరు అబద్దాలు 66 మోసాలను బయట పెట్టడానికి సిద్ధం ఉన్నానని సవాల్ చేసాడు. కాంగ్రెస్ నాయకుల అవినీతి అక్రమాలు సాగవు, సాగనివ్వనని హెచ్చరించారు.

నియోజకవర్గం అభివద్ధికి తను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని దానికోసమే నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సహకారంతోనే రాబోయే రోజుల్లో ఇందూర్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీని స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో బొంద పెట్టడం ఖాయం అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పాలన పైన దృష్టి పెట్టాలని ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షునికి సన్మానం


అధ్యక్షున్ని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల రెంజల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎంపికైన గైని కిరణ్‌ను సాటాపూర్ యువజన నాయకులు శుక్రవారం శాలువా కప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో చిన్నోళ్ల రాకేష్, హనుమాన్లు, గంగాధర్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

నవతెలంగాణ-ఆర్మూర్

ఎనిమియా ముక్త్ భారత్ కార్యక్రమం లో భాగంగా పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ రాం మందిర్ పాఠశాలలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా 6, 7 వ తరగతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, ప్రధానోపాధ్యాయులు జి.గంగాధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

నవతెలంగాణ- పొతంగల్

కోటగిరి మండలం కొల్లూరు గ్రామానికి చెందిన నిమ్మల పోశెట్టి అనే వ్యక్తికి శుక్రవారం ఐదవ అదనపు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి కే.రవికుమార్ నిందితుడికి జీవితఖైదు, వెయ్యిరూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమాన చెల్లించని ఎడల సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు గ్రామానికి చెందిన నిమ్మల పోశెట్టి (50). 2022లో రాత్రివేళ తన భార్యను కట్టెలతో చంపిన సంఘటనలో ఆయన కూతురు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రాము కేసు నమోదు చేసి సీఐ జాన్ రెడ్డి చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో బాధితుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్ రావు వాదనలు వినిపించారు. కోటగిరి ఎస్ఐ సందీప్ సాక్షులను లైజనింగ్ ఆఫీసర్ శంకర్, సీడీఓ సంతోష్ హాజరు పరిచారు. కేసు విషయమై బోధన్ ఏసిపి శ్రీనివాస్, సీఐ కృష్ణ సహకరించారు.

ఉచిత మొబైల్ కంటి శిబిరం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ కంటి శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. కంటి వైద్యులు సతీష్ ఆధ్వర్యంలో సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించగా, 40 మందికి మోతి బిందు ఉన్నట్లు గుర్తించారు. వారికి సోమవారం బోధన్ లైన్స్ క్లబ్ లో ఉచిత మోతి బిందు ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు క్యాంప్ ఇంచార్జ్ హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, అవినాష్, స్థానిక నాయకులు రవీంద్రబాబు, సాజిద్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం కప్ క్రీడ పోటీలను విజయవంతం చేయాలి

- ఎంపిడిఓ లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

సిఎం కప్ 2024 క్రీడా పోటీలను డిసెంబర్ 10, 11, 12 తేదీలలో ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నామని, ఈ పోటిలను విజయవంతం చేయాలని ఇందల్ వాయి మండల పరిషత్ అభివద్ధి అధికారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ప్రధాన క్రీడలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మండల యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుందని, రిజిస్ట్రేషన్ వివరాలను మీ మండల కమిటీతో లేదా సంబంధిత అధికారులతో సంప్రదించవచ్చని సూచించారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో జరుగుతున్న ఈ కార్యక్రమం క్రీడా అభివద్ధికి దోహదపడుతుందని ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆశా వర్కర్ల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని, పీహెచ్సీ పరిధిలోని ఆశా వర్కర్ల యూనియన్ నూతన కమిటీని, గౌరవాధ్యక్షుడు నన్నేసాబ్ సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా స్వప్న, ప్రధాన కార్యదర్శిగా రేష్మా, కోశాధికారిగా ఫర్జానా, వర్కింగ్ ప్రెసిడెంట్ గా రమణి, కార్యవర్గ సభ్యులుగా పద్మ, సునీత, నాగమణి, మమత, అనిత, రుక్మిణి, సవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

ఒకరికి 3 సంవత్సరాల జైలుశిక్ష

- పోలీసు విధులకు ఆటంకం కలిగించినందుకు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో గత యేడాది ఏప్రిల్‌లో పాతబస్టాండ్ వద్ద గల హైటెక్ బార్ వద్ద జరిగిన ఘటనలో పోలీసు విధులను ఆటంకపరచిన కేసులో రౌడిషీటర్ అబ్దుల్ అనే వ్యక్తికి 3 సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి దేవన్ అజయ్ కుమార్ ఆ వ్యక్తికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 100 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డా.సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం ఏప్రిల్ లో రాత్రి 9 గంటల సమయంలో బ్లూకోట్ పోలీసులు బాలాజీ, సంజీవ్ విధులు నిర్వహిస్తున్నారు, రాత్రి 11 గంటల సమయంలో రవీందర్ అనే వ్యక్తి 100 డయల్ చేసి హైటెక్ బార్ దగ్గర మిర్చీలు అమ్ముకునే రవీందర్‌ను రౌడీ షీటర్ అబ్దుల్ డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులు పెడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అబ్బుకు సర్దిచెప్పిన వినలేదు. పోలీసు వారితో గొడవపడి గాయపరిచాడు. వారి విధులను ఆటంకపరచడమే కాకుండా వారిని అసభ్య పదజాలంతో దూషించాడు. కానిస్టేబుల్ బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌స్పెక్టర్ బి.డి ప్రేమ్ కుమార్ కేసు నమోదు చేసుకొని, అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ జి. నరేష్ చార్జిషీటు దాఖలు చేశారు.ఈ కేసును శుక్రవారం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పి. సమ్మయ్య పోలీసు సాక్షుల తరపున వాదించారు. కేసులో వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి దేవన్ అజయ్ కుమార్ తీర్పు వెల్లడిస్తూ నిందితుడు అబ్దుల్‌కు మూడు సంవత్సరాల కఠిన కారాగారా శిక్షతో పాటు వంద రూపాయల జరిమానా విధించారు. జరిమాన చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో ప్రస్తుతం బోధన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ నారాయణ, ఏసిపి శ్రీనివాస్, కోర్టు లైజనింగ్ శంకర్, సజన్ సహకరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 07, 2024 | www.navatelangana.com

జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించిన జిల్లా జడ్జి

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి జిల్లాలో ఉన్నటువంటి బాల రక్షా బంధన్ కార్యాలయంలో జిల్లా జువెనైల్ జస్టిస్ బోర్డును జిల్లా జడ్జి వర ప్రసాద్ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా ప్రారంభమైన తర్వాత మొట్టమొదటిసారిగా జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయం అని, చట్టంతో విభేదించబడిన పిల్లలకు ఈ కోర్టు ద్వారా న్యాయం చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ , డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ నాగరాణి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి



మండలంలోని కృష్ణజి వాడి ప్రాథమిక పాఠశాలలో గత పది సంవత్సరాలుగా విద్యార్థులకు అత్యంత ఓపికతో విద్యాబుద్ధులు నేర్పి పదోన్నతిపై వెళ్లిన సంధ్య శ్రీనివాసులకు శుక్రవారం సన్మానం చేపట్టినట్లు ప్రధానోపాధ్యాయురాలు సంగు బై తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో..



ఆర్మూర్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



కంఠేశ్వర్ : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..



ఎడపల్లి మండలంలో..

- ఫెడరల్ స్ఫూర్తిని కాపాడటమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళ్లు

అంబేద్కర్ కృషి వల్లే

అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలుసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంబేద్కర్ కృషి వల్లే అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు దక్కాయని పేర్కొన్నారు. ఫెడరల్ స్ఫూర్తిని కాపాడడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని అన్నారు.

నవతెలంగాణ-విలేకరులబృందం

బాల్కొండ:డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్కొండ ఎస్ ఐబి.నరేష్ పాల్గొనిడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశానికి రాజ్యాంగం అందించిన ప్రపంచ మేధావి అని గుర్తు చేశారు. యువ విభాగం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, ఉపాధ్యక్షుడు విక్కీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యు) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోడ.అనిల్ మాట్లాడుతు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు తో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగం బలోపేతానికి, కులమత రహిత, సమాజ స్థాపనకై మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ సింగ్ ఠాకూర్, నగర కార్యదర్శి సందీప్, నాయకులు పాల్గొన్నారు

జ్ఞానానికి ప్రతీకగా నిలిచిన వ్యక్తి అంబేద్కర్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదట పులంగ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం బిజెపి జిల్లా కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ మాట్లాడుతు... అంబేద్కర్ ఒక జాతికి నాయకుడు కాదని, ప్రపంచ దేశాలు సైతం గౌరవించే ఒక శక్తిగా అంబేద్కర్ ఎదగడం భారతీయులుగా గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రచించి జ్ఞానానికి ప్రతికగా నిలిచిన వ్యక్తి అంబేద్కర్‌ని తెలిపారు. అటువంటి మహనీయున్ని స్వయంగా ఐక్యరాజ్య సమితి సింబల్ ఆఫ్ నాలెడ్జ్ గా గుర్తించిందని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే తమకు పవిత్ర గ్రంథం అని తెలిపారు. బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ పేరు, ప్రతిష్టలు ప్రపంచదేశాలకు విస్తరించే విధంగా పంచతీర్థాల పేరుతో ఆయన పుట్టుక దగ్గర నుండి ఆయన గడిపిన ప్రదేశాలన్ని పంచతీర్థాల పేరుతో ఐదు క్షేత్రాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు అంబేద్కర్ ఆశయాలకు, ఆకాంక్షాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :మండల కేంద్రంలోని కమ్మర్ పల్లి మాదిగ సంఘం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వ్యాపార సముదాయం ముందున్న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి మాదిగ సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాజా మాజా ఎంపీటీసీ మైలారం సుధాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. అంబేద్కర్ కృషి వల్లే అణగారిన వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొంటికంటి నరేందర్, మైలారం బాలు, గడిసందుల సాయన్న, కొంట్టి కంటి అనిల్, గంగాధర్, బాలయ్య, పవన్, సన్నీ, శ్రీను, సుభాష్, తదితరులు పాల్గొన్నారు

పోతంగల్ : మండలంలోని హంగార్గ ఫారంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుప్పాల శంకర్, ఎఎంసి చైర్మన్ గాయక్వాడ్ హన్మంతు, కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండల యూత్ అధ్యక్షులు చాంద్ పాషా, నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అట్టడుగు కులాలపై అణిచివేతను గ్రహించి వాటి నుండి విముక్తి పొందడం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. దేశం లో మహిళలు సమాజంలో సగభాగం అని, వారు చదువుకుంటే భారతదేశాన్ని తీర్చిదిద్దుతారని మహిళలకు ఓటు హక్కు ఉంటే పాలకుల్ని వారే ఎన్నుకుంటారని పార్లమెంటులో 50 శాతం మహిళలు ఉండాలని పేర్కొన్నారని తెలిపారు. రాజ్యాంగాన్ని కొంతమంది తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సినటువంటి బాధ్యత భారతీయులందరికీ పైన ఉంది అని ఆమె అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, జిల్లా కమిటీ సభ్యులు వనజ, మాధవి పాల్గొన్నారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో వసంతరావు పిల్లి. శ్రీకాంత్, పులి జైపాల్, బిట్ల రవి, తుకారం, గంగారాం, గంగా ప్రసాద్,చుక్కబొట్లరాజు ఏరేటి నారాయణ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో..

టీఎన్జీవోఎస్ కార్యాలయంలో టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిఎన్జీవో సహధ్యక్షులు నారాయణరెడ్డి, టీఎన్జీవో కేంద్ర సంఘం ఉపాధ్యక్షులు గైని గంగారాం, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, కేంద్ర కార్యవర్గ సభ్యులు మచ్చుకూరి సతీష్, జిల్లా కోశాధికారి సుంకరి దినేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు అతిక్ అహ్మద్, జిల్లా సంయుక్త కార్యదర్శి జాఫర్ హుస్సేన్, టీఎన్జీవో అర్బన్ యూనిట్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో..

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పూలాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాదిగ జేఏసీ జిల్లా కమిటీ పక్షాన ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా నాయకులు మల్లాని శివ, గంగాధర్, సాయి, నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గల్లీ మాల సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని పోచమ్మ గల్లీలో మాల సంఘ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘస్త్ర అధ్యక్షులు పులి జైపాల్, నీలగిరి చందు, ఉపాధ్యక్షులు గజ్జల శంకర్, అధ్యక్షులు బక్కోళ్ల గంగాధర్, సహాయ కార్యదర్శి రమేష్, అభిలాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్ రాజ్, సలహాదారులు నీలగిరి రాజు, నాంది వినయ్, సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక పులాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, ధర్మనం దేవేందర్, కరిపే రవింధర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, వాసం జయ, బాలన్న పాల్గొన్నారు.

సిరికొండ :మండల కేంద్రంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. జాగృతి రూరల్ కన్వీనర్ సాయి మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని ప్రజాస్వామ్యం కోసం అంబేద్కర్ పోరాటం చేశారన్నారు. కుటుంబాన్ని త్యాగం చేసిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు

మాక్లూర్ :మండలంలోని మామిడిపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబెద్కర్ 68వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తెడ్డు శేఖర్, కార్యదర్శి డీ, సి గంగాధర్, గౌరవ అధ్యక్షులు తలారి రాములు, కుషియర్ ఎర్రన్న, సభ్యులు స్వామి, రాజేశ్వర్, బొర్రాన్న పాల్గొన్నారు.

బోధన్:బోధన్ పట్టణంలోని సాయి ఆదర్శ మహిళ మండలి కార్యాలయంలో ప్రతినిధులు పద్మాసింగ్, మోచి శంకర్, కందారే శంకర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ చౌరస్తాలో తహశీల్దార్ విఠల్, పట్టణ సీఐ వెంకటనారాయణ, రిటైర్డ్ ఎంఈఓ శంకర్, దళితసంఘాలనాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బోధన్ మండలం పెంటాఖుర్దు గ్రామంలో ఎన్‌పీఆర్‌డీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బిక్నెల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం నాయకులు రమాకాంత్ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు.

సాలూర మండలంలో...

సాలూర మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు, సంఘ సభ్యులు రావుల లక్ష్మణ్, రాజేందర్, సంజీవ్, సరిడే సాయిలు తదితరులు అంబేద్కర్ వర్ధంతి సందర్భంగ పంచశీల జెండా అవగతం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘ నాయకులు భీమ్‌రావ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు.

ముప్కాల్:ముప్కాల్ గ్రామపరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని నల్లూర్, రెంజర్ల గ్రామాల్లో సైతం అంబేద్కర్ సంఘం నాయకులు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో 'ముప్కాల్ గ్రామపరిరక్షణ సమితి' అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ థామస్, సమితి గౌరవ సలహాదారులు టి.సాయన్న, గద్దల గంగారాం, గద్దల రమేష్, నరేష్ ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్, ఏలేటి గంగారెడ్డి, బద్దం నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పెంటు గంగాధర్, గోపి రాము, సమితి సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మండల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఎడ్ల ఆనంద్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు శ్యాం సన్ మాట్లాడుతూ.. అంబేద్కర్ భారత దేశంలో కుల రహిత అసమానతలు హెచ్చుతగ్గులు లేని ప్రజాస్వామ్యం కోసం పోరాటం చేశారని అన్నారు. డివిజన్ అధ్యక్షులు తలారి సాయన్న మాట్లాడుతూ.. రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగాన్ని నరేంద్ర మోడీ తుంగలో తొక్కుతున్నారని, దేశంలో మూడు వంతుల్లో రెండింతలు మెజార్టీ మాకు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేపట్టరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి వర్గీకరణ బిల్లును పార్లమెంటు ద్వారా ఆమోదం పొందించిన తర్వాత వర్గీకరణ చేపట్టాల్సి ఉండగా దానికి విరుద్ధంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణ చేపట్టాలని చెప్పించడం రాజ్యాంగానికి తూట్లు పొడిచినట్లు అయిందని విమర్శించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలన సాగించిన వారికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. మండల నాయకులు నీరటి దేవరాజ్, తలారి సాయన్న, న్యాస రాజేశ్వర్, ఉగేర సాయిలు, అశోక్, ముత్తన్న పావు రోజ్, ఎఎంసి డైరెక్టర్ దేవ కరుణ, జమున పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక న్యూ బాయ్స్ హాస్టల్ ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పృధ్వీ మాట్లాడుతూ.. ఈ దేశ ప్రజలు అంటరానితనానికి, అస్పృశ్యతకు ఎందరో బలి అయ్యారని అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మానవాళి అభివృద్ధి చెందితేనే అందరికి సమానత్వం ఏర్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెడరల్ స్ఫూర్తిని విఘాతం కల్గించడం అంటే రాజ్యాంగానికి తూట్లు పొడవడమే అని విమర్శించారు. ఫెడరల్ స్ఫూర్తిని కాపాడడమే ఆయనకి ఇచ్చే ఘన నివాళి అని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాగర్, గణేష్, అనిల్, భరత్ , వంశి తదితర నాయకులు పాల్గొన్నారు.

రెంజల్ :మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట గ్రామ పెద్దలు, యువత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, సాయిబాబా గౌడ్, ఇందిరా దేవి, గైని సాయిలు, పోతురాజు ప్రభాకర్, పోశెట్టి, బి.రవి, ఎల్.కృష్ణ, శరత్, భూమేష్, సాయిలు, గంగాధర్, రెంజల్ గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

కూనేపల్లి గ్రామంలో..

మండలంలోని కూనేపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు రొడ్డలింగం, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వం, యువత పాల్గొన్నారు.

ఆర్మూర్ :భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఐఎం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బిజెపి ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. జెమిలి ఎన్నికలు భారతదేశం మొత్తంగా అమలు చేయాలని గట్టి ప్రయత్నం నరేంద్ర మోడీ చేస్తున్నారు జమిలి ఎన్నికలు వస్తే ప్రజాస్వామ్యం కూని అవుతుందని అన్నారు మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి కులాల మధ్యన చిచ్చు పెడుతుందని అన్నారు. రాబోయే కాలంలో బిజెపి మతోన్మాద విధానాలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను కొంతమంది పెట్టుబడేదారులకి అప్ప ఎక్కుతున్నారని పేద ప్రజలపై భారాలు వేస్తున్నారు అన్నారు దేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి లౌకిక తత్వం కోసం సమానత్వం కోసం ప్రజలందరి సమీకరించి రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కూతాడి ఎల్లయ్య డివిజన్ కమిటీ సభ్యులు భూమన్న, జాదవ్ రాజు, నవీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, జెస్సు అనిల్, ఉదయ్, యామాభాస్కర్, ఆకుల శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు లింగా గౌడ్, జంగం అశోక్ పాల్గొన్నారు.

వర్ని: ఉమ్మడి మండలాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత బి ఆర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహలకు పూలమాలలు వేసి, జోహార్లు పలుకు అంబేద్కర్ సంఘ నాయకులు, ప్రజా ప్రతినిదులు నివాళులు అర్పించారు. చందూర్ మండలంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అధ్యక్షులు మొండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.కార్యక్రమంలో మహేందర్ సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వర్నిలో..


భీంగల్ రూరల్:దళిత సంఘాల ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా దళిత సంఘాల మండల అధ్యక్షులు గడల ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడంలో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైనదని కొనియాడారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటులో అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజేందర్, భాగేశ్ర, రతన్ రాజ్, సాగర్, దళిత నాయకులు, పాల్గొన్నారు.

కోటగిరి:రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68 వర్ధంతి సందర్భంగా దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళ్లఅర్పించారు. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని మూడు సంవత్సరాల 11 నెలల 18 రోజులు రచించిన భారత రాజ్యాంగాన్ని దేశానికి అందించారని, దేశంలో పరిపాలన రాజ్యాంగం మీదనే ఆధారపడి నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు మిర్జాపూర్ సాయన్న, మాజీ ఎంపిటిసి సాయిలు, అంబేద్కర్ సంఘ కోటగిరి మండల అధ్యక్షులు బి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి :భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని, దూపల్లి సహకార సంఘం డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నీరడి రవికుమార్, మంగళ్ పహాడ్ మాజీ ఎంపీటీసీ బుడ్డ విజయలక్ష్మి పోశెట్టి అన్నారు. మండలంలోని మంగళ్ పాడ్, పోచారం, కుర్నపల్లి, జానకంపేట, ఏఆర్‌పి క్యాంప్, సాతాపూర్ గేట్, వడ్డేపల్లి, ఎడపల్లి, జమలం, బాపూనగర్, బాపునగర్, వడ్డేపల్లి, తానాకాలన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను దళిత సంఘాల నాయకులు, యువకులు నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు, యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జక్రాన్‌పల్లి :మండల కేంద్రంలో మాల సంఘం ఆహ్వానం మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. ఆయన ఆలోచన విధానం పౌరులందరికీ సమాన హక్కులు, సామాజిక న్యాయం వర్తించేలా రాజ్యాంగాన్ని రచించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చివరి శ్వాస వరకు పోరాడిన సమసమాజ స్వాప్నికుడని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు దున్న మహేష్, మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, మైనార్టీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల సైకిల్ టెక్స్ అక్బర్, నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి :మండల కేంద్రంలో భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో సునీల్ కుమార్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ చూపించిన దారిలో యువత ముందుకు నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్రప్రసాద్, తెడ్డు రమేష్, పాలెపు చిన్న గంగారాం, సాయి కుమార్, సింగిరెడ్డి శేఖర్, మారయ్య గజేష్, అజ్మత్ హుస్సేన్, అజారుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: ఐద్వా ఆధ్వర్యంలో..



పోతంగల్ మండలకేంద్రంలో..



డిచ్‌పల్లి : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..



కమ్మర్‌పల్లి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..